


# VIBHARE TELUGU DAILY

తెలుగు దినపత్రిక









PUBLISHED FROM KURNOOL   ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి   మంగళవారం 07 డిసెంబరు 2021   సంపుటి : 03   సంచిక : 104   పేజీలు : 4   వెల : రూ 3-00


## ఎనలేని సేవలు అందించిన అంబెద్కర్



అమరావతి అంబేద్కర్ దేశానికి ఎనలేని సేవలందించారు. అంబేద్కర్ స్ఫూర్తితో తెలుగుదేశం పని చేస్తోందని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు దూరదృష్టి ఉన్న భారత దేశ శిల్పి అంబేద్కర్. రాజ్యాంగం మంచిదైనా.. చెడ్డ వాళ్లు అమలు చేస్తే చెడ్డ రాజ్యాంగమేనని నాడే అంబేద్కర్ వ్యాఖ్యానించారు. 2016లో అంబేద్కర్ జన్మదినం సందర్భంగా అమరావతిలో 125 అడుగుల ఎత్తైన విగ్రహం పెట్టాలనుకున్నాం. రూ. 210 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశాం.. 20 ఎకరాల భూమిని కేటాయించాం. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటును ఈ ప్రభుత్వం పక్కన పెట్టేసింది. టీడీపీ ఇచ్చిన జీవోను పక్కన పెట్టేసింది. అమరావతిలో పెట్టాలనుకున్న అంబేద్కర్ విగ్రహ ప్రాజెక్టును బేషరతుగా అమలు చేయాలి. అంబేద్కర్ స్ఫూర్తితో టీడీపీ స్థాపించారు. కూడు, గూడు, బట్ట అనే నినాదంతో ప్రభుత్వాన్ని నడిపిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్. ఏజెన్సీ ప్రాంతాల్లో పక్కా ఇళ్లను నిర్మించి ఇచ్చిన ఘనత ఎన్టీఆరుది. ఇల్లు అనేది ఓ సెంటిమెంట్. ఎన్టీఆర్ పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టాకే.. మిగిలిన నేతలూ నిర్మాణం ప్రారంభించారని అన్నారు.

## అంబేద్కర్‌కు నివాళులర్పించిన చంద్రబాబు

అమరావతి: అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి టీడీపీ అధినేత చంద్రబాబు పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేతలు అచ్చెన్నాయుడు, వర్ల రామయ్య, స్థానిక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా 125 అడుగుల విగ్రహం పెట్టాలని ఆనాడు నిర్ణయించామన్నారు. రాజధానిలో 20 ఎకరాల విస్తీర్ణంలో అంబేద్కర్ స్మారక నిర్మాణానికి ఉత్తర్వులు కూడా ఇచ్చామన్నారు. అలాంటి ప్రాజెక్టును జగన్ సర్కార్ పక్కన పెట్టేసిందని విమర్శించారు. రాజధానిలో అంబేద్కర్ స్మారక ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ హయాంలోనే పేదలకు పక్కా ఇళ్ల పథకం వచ్చిందని చంద్రబాబు తెలిపారు. 56 లక్షల 69 వేల మంది ఇళ్ల యజమానుల నుంచి రూ. 10 వేలు, రూ. 20 వేలు కట్టించుకునే పని మొదలు పెట్టారని, ఓటీఎస్ కోసం ఒత్తిడి లేదు అనేది పచ్చి అబద్ధమ న్నారు. ఓటీఎస్‌కు అంగీకరించకపోతే అన్ని పథకాలు నిలిపివేస్తామని అధికారులు అన్న ఫోన్ కాల్ వాయిన్‌లను చంద్రబాబు ప్రదర్శించారు. ఇచ్చిన మాట తప్పిన సీఎంపై చీటింగ్ కేసు పెట్టాలని చంద్రబాబు అన్నారు



## ఓటీఎస్ విషయంలో సహాయ నిరాకరణ : చంద్రబాబు



అమరావతి ఓటీఎస్ మీద ఆందోళన చేస్తే కేసులు పెడతారా..? కొందరు పోలీసులకు కండకావరం పెరిగింది. పోలీసులు ఉన్నది చట్టాన్ని అమలు చేయడానికే కానీ.. చట్టాన్ని ఉల్లంఘించేందుకు కాదని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. కేసులకు భయపడి ప్రజా పోరాటాలు చేయకుండా ఉండం. పేదల పట్ల ఈ ప్రభుత్వానికి ఎందుకంత వివక్ష..? టీడీపీ హయాంలో రూ. 10 వేలు ఇచ్చి ఇళ్ల రిపేర్లకు ఇచ్చాం. పేదల ఇళ్ల నిర్మాణాలను షీర్ వాల్ టెక్నాలజీతో చేశాం. గేటెడ్ కమ్యూనిటీ తరహాలో పేదల ఇళ్ల సముదాయాన్ని నిర్మించాం. 2.60 లక్షల ఇళ్లకు శ్రీకారం చుడితే వాటిని పక్కన పెట్టేశారు. కరోనా సెంటర్ల కోసం.. వరద బాధితుల కోసం టిడ్కో ఇళ్లను ఉపయోగిస్తున్నారు. టీడీపీ రాగానే ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేస్తాం. ఓటీఎస్ విషయంలో ప్రజలు సహాయ నిరాకరణ చేయాలి.. టీడీపీ అండగా ఉంటుంది. పేదల ద్రోహి వైసీపీ. పేదలను అవమానిస్తే.. అంబేద్కరును అవమానించినట్టేనని అయన అన్నారు.

# 7 పేజీలతో ఇంటి రిజిస్ట్రేషన్ పట్టా

అమరావతి: జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఇచ్చే ఇళ్ల నమూనా రిజిస్ట్రేషన్ పత్రాలను గృహనిర్మాణ శాఖ ఏడు పేజీలతో రూపొందించింది. రిజిస్ట్రేషన్ వివరాలు, ఆస్తి సరిహద్దులు, ఇతర వివరాలను ఇందులో పొందుపరిచింది. పేదలకు ఇచ్చిన ఇళ్లు, ఇళ్ల పట్టాలను పొందిన లబ్ధిదారులకు యాజమాన్య హక్కు కల్పించేలా రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ లిమిటెడ్ తరఫున ఆయా మండలాల తహసీల్దార్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. రిజిస్ట్రేషన్ పత్రాల కవర్‌పేజీపై సీఎం జగన్ ఫొటోతో పాటు.. గృహ నిర్మాణ శాఖ లోగోను ముద్రించారు. కవర్‌పేజీని నీలం, ఆకుపచ్చ రంగులతో తీర్చిదిద్దారు. రిజిస్ట్రేషన్ చేయించటానికి తీసుకున్న స్టాంపు పేపర్, స్థల హద్దులను తెలిపే బాండ్ పేపర్లపై కూడా సీఎం ఫొటో, గృహనిర్మాణ శాఖ లోగోలను ముద్రించారు. ప్రతి పేజీ అడుగు భాగంలోనూ ముఖ్యమంత్రి ఫొటో ఉంది. 5వ పేజీలో రిజిస్ట్రేషన్ చట్టప్రకారం ఎగ్జిక్యూటెంట్ దగ్గర తహసీల్దారు ఫొటో, వేలిముద్ర.. అనుభవదారు స్థానంలో లబ్ధిదారు ఫొటో, వేలిముద్రలు ఉన్నాయి. హక్కుపత్రాలతో పాటు 'అక్కచెల్లెమ్మలకు, అన్నదమ్ములకు, కుటుంబసభ్యులందరికీ నిండు మనసుతో రాస్తున్న ఉత్తరమిది' అంటూ సీఎం రాసిన రెండు పేజీల లేఖను జత చేశారు. పథకం లక్ష్యం, రాష్ట్రవ్యాప్తంగా ఎంత మందికి ప్రయోజనం కలుగుతుందనే వివరాలను లేఖలో ప్రస్తావించారు. ఆఖరి కవర్ పేజీపై సీఎం జగన్, వైఎస్ రాజశేఖరరెడ్డి ఫొటోలు ముద్రించారు. కవర్ పేజీ మాదిరే దీన్ని కూడా నీలం, ఆకుపచ్చ రంగులతో




రూపొందించారు. అయితే, ఈ పథకం కింద రిజిస్ట్రేషన్‌కు మార్గదర్శకాలు అందకపోవటంతో తహసీల్దార్లలో గందరగోళం నెలకొంది.

# ఆర్మీ కాల్పుల ఘటన పట్ల ఎఫ్ఐఆర్ రిజిస్టర్

## సిట్ ఏర్పాటు.. నెల రోజుల్లోనే విచారణను పూర్తి..అమిత్ షా

న్యూఢిల్లీ డిసెంబర్ 6 నాగాలాండ్‌లో కూలీలపై ఆర్మీ కాల్పులు జరిపిన ఘటన పట్ల ఇవాళ లోక్‌సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటన చేశారు. మాన్‌లోని ఓటింగ్‌లో తీవ్రవాదుల కదలికలు ఉన్నట్లు ఆర్మీకి సమాచారం వచ్చిందని, ఆ సమయంలో అనుమానాస్పద ప్రాంతంలో సుమారు 21 మంది కమాండోలు ఆపరేషన్‌కు సిద్ధమయ్యారని, అయితే అక్కడకు వచ్చిన వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా.. ఆ వాహనం ఆగకుండా వెళ్లిందన్నారు. దీంతో ఆ వాహనంలో తీవ్రవాదులను తరలిస్తున్నట్లు అనుమానించి ఆర్మీ కాల్పులు జరపాల్సి వచ్చిందని షా తెలిపారు. ఆ వాహనంలో ఉన్న 8 మందిలో 6 మంది కాల్పులకు బలైనట్లు ఆయన చెప్పారు. గాయపడ్డ ఇద్దర్ని సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి ఆర్మీ తరలించిందన్నారు. ఈ ఘటన తర్వాత గ్రామస్తులు ఆర్మీ యూనిట్‌ను చుట్టుముట్టి, రెండు వాహనాలు ధ్వంసం చేశారని, సైనికులపై తిరగబడ్డారని హోంమంత్రి చెప్పారు. గ్రామస్థుల తిరుగుబాటులో ఓ సైనికుడు మృతిచెందినట్లు ఆయన వెల్లడించారు. ఆత్మరక్షణ కోసం సైనికులు ఫైరింగ్ జరిపారన్నారు. కాల్పుల వల్ల మరో ఏడు మంది పౌరులు మృతిచెందినట్లు షా వెల్లడించారు. ప్రస్తుతం పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నా.. అదుపులోనే ఉందన్నారు.



ఘటన జరిగిన ప్రాంతాన్ని డిసెంబర్ 5వ తేదీన నాగాలాండ్ డీజీపీ, కమిషనర్ విజిట్ చేశారన్నారు. ఆర్మీ కాల్పుల ఘటన పట్ల ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేశామన్నారు. కేసు విచారణ కోసం రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. నెల రోజుల్లోనే విచారణను పూర్తి చేయాలని సిట్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు మంత్రి చెప్పారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# తెలంగాణలో కూడా ఒమిక్రాన్ కేసులు నమోదు కాలేదు

## భయం వద్దు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ శ్రీనివాసరావు



హైదరాబాద్ డిసెంబర్ 6 దేశ ప్రజలకు ప్రస్తుతం 'ఒమిక్రాన్' భయం పట్టుకుంది. నిన్న ఒక్కరోజే 17 ఒమిక్రాన్ కేసులు నమోదవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే అధికారికంగా మాత్రం 5 మాత్రమే ఒమిక్రాన్ కేసులు గుర్తించామని అధికారులు అంటున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో కూడా ఒమిక్రాన్ కేసులు నమోదవుతున్నాయని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ శ్రీనివాసరావు ఈ ప్రచారంపై స్పందించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఒమిక్రాన్ కేసు నమోదు కాలేదన్నారు. అయితే తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టిమ్స్ ఆసుపత్రిలో చేరిన వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. అయితే జీనోమ్ రిపోర్టులు వచ్చాకే నిర్ధారించుకోవాలని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఒమిక్రాన్ కేసులు నమోదయ్యాయని కొందరు ఊహాగానాలతో తప్పుడుప్రచారం చేస్తున్నారన్నారు. ఇలాంటివ ప్రజలు నమ్మొద్దని సూచించారు. కొవిడ్ సోకిన వారు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు. అప్పుడే జీనోమ్ సీక్వెన్స్ తెలిసిపోతుందన్నారు. అలాగే మెరుగైన వైద్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ గా చికిత్స చేసుకోవడం ద్వారా ఒమిక్రాన్ కేసులు గుర్తించడానికి అవకాశం ఉండదన్నారు. ఇక బూస్టర్ డోస్ గురించి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపామన్నారు. మరోవైపు చిన్న పిల్లలకు వ్యాక్సిన్ ఇచ్చే విషయంపై కూడా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం వేచిచూస్తున్నామన్నారు. ప్రతి నలుగురిలో ఒక్కరికే వ్యాక్సిన్ అందిందని అందుకే కొత్త వేరియంట్ పుట్టుకొంచిందన్నారు. ఇక రాష్ట్రంలో లాక్ డౌన్ విషయంపై వదంతులు నమ్మొద్దన్నారు. అలాంటి ప్రచారం చేసేవారిపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. మిగతా వేరియంట్ ల కంటే ఒమిక్రాన్ వేగంగా విస్తరిస్తోందన్నారు. కానీ వారిలో స్వల్ప లక్షణాలు ఉంటున్నాయన్నారు. వాస్తవానికి తీవ్ర ఒళ్లు నొప్పులు తలనొప్పి నీరసం వంటి లక్షణాలు ఉంటే ఒమిక్రాన్ పరీక్ష చేస్తున్నామన్నారు. కానీ టిమ్స్ లో చేరిన అనుమానిత కేసుల్లో ఎవరికీ ఇలాంటి లక్షణాలు లేవన్నారు.

## అంబేద్కర్ కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులు



అమరావతి డిసెంబర్ 6 రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 64 వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్‌తో పాటు హోంశాఖ మంత్రి మేకతోటి సుచరిత, ఎమ్మెల్యేలు మేరుగ నాగార్జున, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కోసం అవిరళ కృషి చేసిన బాబా సాహేబ్

## ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్



విజయవాడ సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఎంతో కృషి చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సేవలు అజరామరమని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. మహా పరినిర్వాణ్ దివస్ పేరిట భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా జరుపుకుంటున్న తరుణంలో సోమవారం సామాజిక మాధ్యమ వేదికగా గవర్నర్ ఆయనకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బిశ్వభూషణ్ హరిచందన్ పేర్కొంటూ అంబేద్కర్ సమాజంలోని అంటరానితనం, కులవివక్షలకు వ్యతిరేకంగా సమసమాజ స్థాపన కోసం అహర్నిశలు కృషి చేసారన్నారు. అంబేద్కర్ సిద్ధాంతాలు ఎప్పటికీ ఆదర్శప్రాయమన్న గవర్నర్, దేశ ప్రజలంతా రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషిచేయడమే ఆయనకు నిజ నివాళి అన్నారు. అంబేద్కర్ ప్రబోధించిన సిద్ధాంతాలు నిత్య చైతన్య స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. రాజ్యాంగం ద్వారా డాక్టర్ అంబేద్కర్ కల్పించిన పౌర హక్కులు, ఆదేశిక సూత్రాలు ప్రజలకు రక్షణగా నిలుస్తున్నాయని, అంబేద్కర్ చూపిన మార్గం ఆచరణీయమని గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. ఈ మేరకు రాజ్ భవన్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.

# రాష్ట్రానికి తుపాన్ల దెబ్బ.. 90వేల కోట్లు నష్టం

తుపానులు అనేక దశాబ్దాలుగా రాష్ట్రంలో విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. 1977 నుంచి ఇప్పటివరకు ఏకంగా 66 తుపాన్లు రాష్ట్రంపై విరుచుకుపడ్డాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం.. వీటి వల్ల రూ.90 వేల కోట్లకుపైగా ఆర్థిక నష్టం జరిగింది. 1891 నుంచి 2019 వరకు 184 తుపాన్లు ఏపీ తీరంలో తీరం దాటినట్లు ఐఎండీ (భారత వాతావరణ శాఖ) నివేదికలు చెబుతున్నాయి. ఏటా అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌ల్లో కనీసం ఒక తుపానైనా రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపడం ఆనవాయితీగా మారింది. ప్రతి రెండు, మూడేళ్లకు ఒకసారి వీటిలో తీవ్ర తుపానులు ఉంటున్నా యి. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా ప్రకారం.. ఒడిశా తర్వాత తుపాన్ల బారిన ఎక్కువగా పడుత న్న రెండో రాష్ట్ర ంగా ఆంధ్రప్రదేశ్ ఉంది. బంగాళాఖాతం తుఫాన్లు ఏర్పడడానికి అనువైన ప్రాంతంగా ఉండడమే ఇందుకు కారణం.



# సంపాదకీయం

మంగళవారం 07 డిసెంబరు 2021

## 37 ఏళ్లు దాటిన ఇంకా విషాదమే

దేశంలో అత్యంత విషాద ఘటనగా, అతి పెద్ద పారిశ్రామిక విపత్తుగా భోపాల్ గ్యాస్ దుర్ఘటన నిలిచింది. మధ్యప్రదేశ్ లోని భోపాల్‌లో యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్ (యుసిఐఎల్) పురుగు మందుల ప్లాంట్‌లో గ్యాస్ దుర్ఘటన జరిగి 37 ఏళ్ళు. సుమారు 8000 మందికి పైగా మృతి చెందగా 5 లక్షలకు పైగా జనాభా దీని ప్రభావానికి లోనయ్యారని ఒక అంచనా! భోపాల్ దుర్ఘటనకు యూనియన్ కార్బైడ్ యాజమాన్య నిర్లక్ష్యం, భద్రతా లోపాలే కారణమని అనేక నివేదికలు తేటతెల్లం చేశాయి. భోపాల్ లో గల యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్ (యుసిఐఎల్) పురుగుమందుల ప్లాంట్లో 1984 రాత్రి పూట జరిగింది. 500,000 మందికిపైగా ప్రజలు మిథైల్ ఐసోసైనేడ్ (ఓఎఐ) వాయువు, ఇతర రసాయనాల ప్రభావానికి గురయ్యారు. భోపాల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 56 వార్డులు ఉంటే– 36 వార్డుల్లో విషవాయువు ప్రభావం చూపింది.మృతుల సంఖ్యపై వివిధ నివేదికలు ఇచ్చిన అంచనాలు వేర్వేరుగా ఉన్నాయి. మధ్యప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక లెక్కల ప్రకారం మృతుల సంఖ్య 3,787 మంది, అందులో 2,259 మంది తక్షణమరణానికి గురైనట్టుగా నిర్ధారించింది. 2006 సంవత్సరంలో ఒక ప్రభుత్వ అఫిడవిట్లో గ్యాస్ లీకేజి వలన 5, 58,125 మంది ప్రభావితమైనట్టు పేర్కొంది. ఇందులో 38,478 తాత్కాలిక ప్రభావానికి, 3,900 శాశ్వత ప్రభావానికి గురయ్యారని తెలిపింది. అంతేగాక, ప్రమాదం జరిగిన రెండువారాలలోపులోనే 8,000 మంది మరణించారని, గ్యాస్–సంబంధిత వ్యాధుల కారణంగా జీవితాలతో పోరాడలేక మరో 8,000 పైగా వ్యక్తులు మరణించారని ఒక అంచనా.దేశంలో ఈ ఘటన అనంతరం జరిగిన వాటిలో 2020 మే 7న విశాఖపట్నం లోని ఎల్.జి పాలిమర్స్ గ్యాస్ లీక్ కూడా భోపాల్ ఘటనను తలపించింది. విశాఖ దుర్ఘటనలో 11 మంది మృతి చెందగా, దాదాపు వెయ్యి మందికి పైగా విష వాయువుల ప్రభావానికి లోనయ్యారు. సరళీకరణ విధానాల మూలంగా విదేశాల్లో నిషేధించిన అనేక విషపూరిత రసాయన, ఫార్మా కంపెనీలు మన దేశానికి రావడంతో ఏదో మూల భోపాల్ లేదా విశాఖ ఎల్.జి గ్యాస్ లీక్ లాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజల ప్రాణాలు పోతూనే ఉన్నాయి. ఇటీవల నవంబర్ 28న రాత్రి విశాఖపట్నం ఫార్మా సిటీలో విష వాయువులు విడుదల కావడంతో ముక్కుపచ్చలారని ఇద్దరు యువ కార్మికులు మృత్యువాతపడ్డారు.భోపాల్ దుర్ఘటన నుండి ప్రభుత్వాలు ఏ గుణపాఠాలు నేర్చుకోలేదనే చెప్పాలి. భోపాల్ గ్యాస్ దుర్ఘటనకు కారణమైన వారెన్ ఆండర్సన్‌ను శిక్షించడంలోను, బాధితులకు నష్టపరిహారం అందించడంలోను ప్రభుత్వాలు అనుసరించిన తీరు అత్యంత దుర్మార్గంగా ఉంది. నేటికీ భోపాల్ దుర్ఘటన బాధితులు జీవచ్ఛవాలుగానే బతుకుతున్నారు. అభివృద్ధి పేరుతో లాభాలే పరమావధిగా నడుస్తున్న పరిశ్రమల వల్ల పర్యావరణానికి, ప్రజలకు నష్టమని తెలిసి కూడా అటువంటి పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నారు. కనీస ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారం నడుపుతున్నా పట్టించుకునేవారే లేరు! పరిశ్రమల్లో ప్రమాణాలు కాపాడాల్సిన కాలుష్య నియంత్రణా బోర్డు, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్, ఫైర్ డిపార్టుమెంట్లు?ప్రభుత్వాలు చెప్పినట్లు, యాజమాన్యాలకు అనుకూలంగా అనుసరిస్తోన్న ఘటనలు అనేకం ఉన్నాయి.దీనివల్ల భవిష్యత్‌లో మరిన్ని భోపాల్, ఎల్.జి. ఘటనలు పునరావృతం కాక తప్పదనిపిస్తోంది. పర్యావరణ అసమతుల్యత కారణంగా ప్రకృతి విపత్తులు తలెత్తడం, వాతావరణ సమతుల్యత సరిగా లేకపోవడం వలన అనేక ప్రాంతాలు నష్టపోవడం చూస్తూనే ఉన్నాం. విశాఖపట్నం సమీపంలోని పరవాడ వద్ద 'రాంకీ' డెవలపర్‌గా జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీని 2005లో నెలకొల్పారు. హైదరాబాద్ పఠాన్ చెరువులోని అనేక ఫార్మా కంపెనీలు, మరిన్ని దేశీయ విదేశీ ఫార్మా కంపెనీలు ఇక్కడికి చేరాయి. ప్రస్తుతం 85 ఫార్మా కంపెనీలు 2500 ఎకరాల విస్తీర్ణంలో ఫార్మా ఉత్పత్తులు చేస్తున్నాయి. ప్రతి ఏడాది నాలుగైదు కంపెనీల్లో ప్రమాదాలు జరగడం అనేక మంది మృత్యువాత పడడం, మరి కొంతమంది క్షతగాత్రులు కావడం జరుగుతోంది.గత ఐదేళ్లలో జరిగిన ప్రమాదాల్లో 32 మంది వరకు మరణించారు. 80 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వం, అధికారులు హడావుడి చేయడం, మృతులకు ఎంతో కొంత నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం తప్ప ఘటనపై సమగ్ర విచారణ జరపడం, వాటిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం, బాధ్యులను శిక్షించడం వంటివేవీ ఈ కాలంలో జరగలేదనే చెప్పాలి. కార్పొరేట్ల చేతుల్లో ప్రభుత్వాలు సైతం వారికి అనుగుణంగా నిబంధనలు సడలించడం వారికి పెద్ద పీట వేయడంతో ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొకపోతే భవిష్యత్‌లో భారీ నష్టం తప్పదు. ఇప్పటికే సరళీకరణ పేరుతో ఎంత సరళం చేసుకుంటున్నామో అన్ని కష్టాలను కొని తెచ్చుకుంటున్నాం. ఇది ఇలాగే కొనసాగితే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతునే ఉంటాయి అలా కాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించినప్పుడు మాత్రమే వాటిని ఆపగలుగుతాం.

## ఏపీలో పీఆర్సీ టెన్షన్.. టెన్షన్

విజయవాడ, డిసెంబర్ 6, (న్యూస్ పల్స్) పీఆర్సీ నివేదిక కోసం కొద్ది రోజులుగా ప్రభుత్వంపై కత్తులు నూరుతున్న ఉద్యోగ సంఘాల నేతలకు సీఎం జగన్ ఝలక్ ఇచ్చారా? రచ్చ చేస్తున్నవారితో చర్చించకుండానే.. కీలక ప్రకటన చేసేశారా? ఆ ప్రకటన తమవల్లే సాధ్యమైందని ఉద్యోగ సంఘాల నాయకులు కాలర్ ఎగరేసుకోకుండా సీఎం స్ట్రాంగ్ స్ట్రోక్ ఇచ్చారా?తాడో పేడో తేల్చుకుంటాం..! ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోవడం లేదు..! పీఆర్సీ నివేదిక ప్రకటిస్తారా లేదా అని రోడ్డెక్కి కార్యాచరణ ప్రకటించారు ఐకాసగా ఏర్పడిన ఏపీ ఉద్యోగ సంఘాల నాయకులు. సీఎం జగన్ ఎప్పుడు చర్చలకు పిలుస్తారు? ఎప్పుడు తమ డిమాండ్లపై చర్చిస్తారు అని ఎదురు చూస్తున్నారు. తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 1న సీఎస్ సమీర్ శర్మను కలిసి ఉద్యమ షెడ్యూల్ కూడా ఇచ్చేశారు ఉద్యోగ సంఘాల నేతలు. ఈ సమస్యకు ఎండ్‌కార్డు ఎలా అని ఆసక్తిగా చర్చించుకుంటున్న సమయంలో తిరుపతి పర్యటనలో ఉన్న సీఎం జగన్ కీలక ప్రకటన చేశారు. ఉద్యోగ సంఘాల నేతలకు ఊహించని ఝలక్ ఇచ్చారు. ఆ ప్రకటనే ఇప్పుడు ఏపీ సచివాలయ.. ఉద్యోగ వర్గాల్లో చర్చగా మారిందిపీఆర్సీ నివేదిక బయట పెట్టాలి.. పీఆర్సీ ప్రకటించాలి.. పెండింగ్ డీఏ చెల్లించాలి అనే డిమాండ్స్‌తో ప్రభుత్వంపై కొన్నాళ్లుగా ఒత్తిడి తెస్తున్నారు ఉద్యోగ సంఘాల నేతలు. ప్రభుత్వం మెడలు వంచేస్తాం.. మా డిమాండ్స్‌కు సర్కార్ దిగి రాక తప్పదు వంటి గంభీర ప్రకటనలు కూడా చేశారు. ముఖ్యమంత్రి జగన్ నుంచి ఇంతవరకు ఎక్కడా స్పందన లేదు. దీనికీ కారణం లేకపోలేదు. వేరే అజెండాను మనసులో ఉంచుకుని.. పీఆర్సీ నెపంతో కొంత మంది ఉద్యోగ సంఘాల నాయకులు ఇలా ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నారనే అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో ఉంది. అందుకే సీఎంవో నుంచి ప్రకటన లేదన్నది ఒక వాదన.ఐకాసగా ఏర్పడిన ఉద్యోగ సంఘాల నేతలెవరూ సీఎంను కలిసే పరిస్థితి లేదు. కేవలం సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి మాత్రమే ఎప్పుడంటే అప్పుడు వెళ్లి ముఖ్యమంత్రిని కలిసి వస్తున్నారనే టాక్ ఉంది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సమయంలో తాను సీఎంను కలిసి మాట్లాడినట్టు.. డిసెంబర్ 10 వరకు పీఆర్సీ ప్రకటిస్తామని చెప్పారని మీడియాకు వెల్లడించారు వెంకట్రామిరెడ్డి. ఇది మిగిలిన ఉద్యోగ సంఘాల నేతలకు కంటగింపుగా మారిందట. తాము బడా ఉద్యోగ సంఘాల నాయకులం అయినప్పటికీ సీఎం ఎందుకు తమను పిలవరు అనే ఫీలింగ్‌లో ఆ వర్గం ఉందట. ఇలా కత్తులు నూరుతున్న ఉద్యోగ సంఘాల నేతలకు సీఎం జగన్ ఝలక్ ఇచ్చారని చర్చ జరుగుతోంది.తిరుపతిలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న సీఎం జగన్‌ను కొంతమంది ఉద్యోగుల కుటుంబసభ్యులు కలిసి.. పీఆర్సీ గురించి విన్నవించారు. పీఆర్సీ ప్రక్రియ పూర్తయిందని.. పదిరోజుల్లో ప్రకటిస్తామని వారికి బదులిచ్చారు ముఖ్యమంత్రి. సాధారణంగా క్యాంప్ ఆఫీసులోనో.. సచివాలయంలోనో ఉద్యోగ సంఘాల నేతలతో గంటకొద్దీ సమావేశం నిర్వహించిన తర్వాత పీఆర్సీ పై ప్రకటన చేస్తుంటారు. అలాంటి ఫార్మాట్ ఏమీ లేకుండా.. తిరుపతి పర్యటనలో అదీ ఒక కాలనీలో పీఆర్సీ గురించి కీలక ప్రకటన చేసేశారు సీఎం జగన్. ఈ ప్రకటన క్రెడిట్‌ను అమరావతిలోని ఏ ఉద్యోగ సంఘం నాయకుడు తన ఖాతాలో వేసుకోకుండా ముఖ్యమంత్రి మాస్టర్ స్ట్రోక్ ఇచ్చారని సచివాలయ సర్కిళ్లలో టాక్ నడుస్తోంది.

## మారుతున్న సర్కారు బళ్లు

మెదక్, డిసెంబర్ 6, (న్యూస్ పల్స్) మహాత్మాగాంధీ, నెహ్రూ, అంబేద్కర్, వివేకానంద, సెవెన్ వండర్స్‌లో ఇఫిల్ టవర్, తాజ్‌మహల్,సౌర కుటుంబం, శరీర భాగాలు, ఆంగ్లంలో రోజులు, ట్రాఫిక్ సిగ్నల్స్, ప్రపంచ పటం, వర్ణమాల, ఫ్రాక్షన్స్, ఇండియా, జంతువులు ఇలా విద్యార్థులకు పాఠ్యాంశాల్లో వచ్చే ప్రతీది చిత్రాల రూపంలో గోడలపై వేయడంతో విద్యార్థులు ఎంతో ఆసక్తిగా చదువుకుంటున్నారు. సీఎం కేసీఆర్ కృషి ఫలితంగా గజ్వేల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు కొత్త రూపును సంతరించుకున్నాయి. ప్రాథమిక పాఠశాల చిన్నారుల్లో ఆసక్తిని అభ్యసన సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పాఠశాలల్లోని గోడలపై వేసిన వివిధ రకాల బొమ్మలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. విద్యార్థులు ఇంటి నుంచి పాఠశాలకు వస్తే అక్కడి వాతావరణాన్ని చూసి మైమరిచిపోతున్నారు. ఆహ్లాదకర వాతావరణాన్ని అందించడంతో పాటు పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచుతూ అభ్యసనానికి దోహదపడుతున్నాయి.గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యపై ఆసక్తిని పెంచడం, అభ్యసన సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా తెలంగాణ సర్కారు బడులను గడిచిన ఏడున్నరేండ్ల కాలం లో సరికొత్తగా తీర్చిదిద్దింది. రూర్బన్ పథకం కింద ప్రాథమిక , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పాఠ్యాంశాల్లోని బొమ్మలను గోడలపై వేయడంతో కొత్తగా వాతావరణం కనిపిస్తున్నది. ప్రధానంగా గోడలపై విద్యార్థులు ఎప్పుడు గుర్తించుకునేలా ఉండే బొమ్మలను వేయించారు. ప్రతిరోజూ వాటిని అధ్యయనం చేయడంలో మరిచిపోలేని విధంగా పాఠ్యాంశాలు ఉంటాయి. ఇలా ప్రతి పాఠశాల గోడలపై బొమ్మలు వేయడంతో కార్పొరేట్ పాఠశాలలను తలపించేలా కనిపించడంతో విద్యార్థులు ఎక్కువగా సర్కారు పాఠశాలల్లో చదువుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. గోడలపై వేసిన బొమ్మలతో విద్యార్థులు చదివింది ఎప్పటికికీ గుర్తుండేలా దోహదపడుతున్నాయి. ప్రాథమిక పాఠశాల దశలోని విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని పై తరగతుల్లో కూడా మరిచిపోలేని విధంగా ఉండేలా తెలుగు, హిందీలో వర్ణమాల, శరీర భాగాలు,ప్రపంచపటం,ఇండియాపటం,సెవెన్‌వండర్స్,ఇండియాలో ముఖ్యమైన ప్రదేశాలు ఇలా ఎన్నో బొమ్మలను వేశారు. దీంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో కిల్లర్ ఫీవర్స్



ఏలూరు, డిసెంబర్ 6, (న్యూస్ పల్స్) వర్షాలతో పాటే వ్యాధుల సీజన్ మొదలైంది. ఆంధ్రప్రదేశ్‌లో కిల్లర్ ఫీవర్స్ దడ పుట్టిస్తున్నాయి. గ్రామాల్లో ప్రజలను జ్వరాలు వణికిస్తున్నాయి. వచ్చింది జ్వరమో, కరోనాయో తెలియక ప్రజలు కలవరపడుతున్నారు. తాజాగా పశ్చిమ గోదావరి జిల్లాలో పలు గ్రామా ల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. అనేక మంది ఆస్పత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా విద్యార్థుల అంతుచిక్కని జ్వరాలతో ఆసుపత్రులపాలవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తమైనా ఇంకా వ్యాధులు ప్రబలకుండా ప్రజారోగ్యశాఖ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.పశ్చిమగోదావరి జిల్లా కొయ్యలగూడెం మండలం బోడిగూడెంలో అంతుచిక్కని జ్వరాలు అల్లాడిస్తున్నాయి. ఎలా వస్తుందో? ఎందుకొస్తుందో తెలియని విష జ్వరాలతో గ్రామం మొత్తం మంచాన పడింది. ఎక్కువగా విద్యార్థులే బాధితులుగా మారుతున్నారు. దాదాపు 50మందికి పైగా స్కూల్ స్టూడెంట్స్ డేంజర్ ఫీవర్స్ బారినపడ్డారు. ఇందులో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మొదట నార్మల్ ఫీవర్‌గానే మొదలవుతోంది. సాధారణ జ్వరమే కదా.. అనుకునేలోపే విశ్వరూపం చూపిస్తోంది. తమకొచ్చింది ఏ జ్వరమో తెలుసుకోకుండా బాధితులు.. స్థానికంగా అందుబాటులో ఉన్న క్లినిక్‌లను ఆశ్రయిస్తుండటంతో ప్రాణాలు కోల్పోతున్నారు.ఒక పక్క కరోనా భ యం వెంటాడుతుండగా మరో పక్క విషజ్వరాలు విజృంభించడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. గ్రామాల్లో అధికశాతం మంది జలుబు, జ్వరం, దగ్గు వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కరోనా కేసులు క్రమేపీ పెరుగుతుండడంతో కొంతమంది ఇళ్లల్లోనే వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకుంటున్నారు. గ్రామాల్లో అనేక చోట్ల పీహెచ్‌సీలకు ప్రతి రోజు వైరల్ జ్వరాల చికిత్సకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. పీహెచ్‌సీలకు ఎక్కువగా జ్వరపీడితులు వస్తున్నారని వైద్యాధికారులు తెలిపారు.వాతావరణంలో చోటు చేసుకున్న పలు మార్పులు కారణంగా విష జ్వరాలు ప్రబలుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. మరోవైపు, మంచినీళ్లు కలుషితం కావడం, శానిటేషన్ సరిగా లేకపోవడంతోనే పిల్లలు విషజ్వరాల బారిన పడుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఈ క్రమంలో గ్రామస్తుల వత్తిడితో అధికారులు వాటర్ ట్యాంకు శుభ్రం చేశారు. ఇప్పటికే శానిటేషన్ పనులు ప్రారంభించారు. అంతేకాక మంచినీటి నమూనాలను సేకరించి టెస్ట్ పంపించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని విష జ్వరాలు తగ్గుముఖం పట్టాయని చిన్నపాటి అనారోగ్య సమస్యలు మాత్రమే ఉన్నాయని ప్రభుత్వ వైద్యులు చెబుతున్నారు.

## డాక్టర్ అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నివాళులు

నంద్యాల స్థానిక నంద్యాల పట్టణం రావుస్ జూనియర్ కళాశాల నందు డా.బాబా సాహెబ్ అంబేద్కర్ గారి 65 వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ పటానికి పూలమాలలతో నివాళులు అర్పించడం జరిగింది బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ విద్యార్థి,యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి షేక్.రియాజ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిలుగా బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ విద్యార్థి,యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంకిరి రామచంద్రుడు రావుస్ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుంకయ్య జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పాలుట్ల రమణ హాజరై మాట్లాడుతూ డాక్టర్ బి.ర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాని నిర్మించి పేద,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారని,ప్రపంచ దేశాలలోనే గొప్ప చరిత్ర కలిగిన మహానుభావుడు, మేధావి అంబేద్కర్. యువత అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని,అంబెద్కర్ గారి ఆశయాలకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అంబేద్కర్ మరణాంతరనీ భారత దేశ ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారం భారత రత్న ఇచ్చి గౌరవించిందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు,అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## సొంత సర్వేతో టెన్షన్

గుంటూరు, డిసెంబర్ 6, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ లో అన్ని ఎన్నికలు పూర్తయ్యాయి. వైసీపీ వన్ సైడ్ విజయం సాధించింది. కింది స్థాయి నుంచి పై స్థాయి వరకూ పెత్తనం వైసీపీదే. ప్రతిపక్షాల ఊసే లేకుండా పోయింది. ఎన్నికల్లో అక్రమాలు, బెదిరింపులు, అవకతవకలు అనిచెబుతున్నా 80 నుంచి 90 శాతం ఫలితాలు వైసీపీ వైపునే ఉన్నాయి. ప్రజలు జగన్ పక్షాన నిలిచారనే చెప్పాలి. ఇంత పెద్ద విజయాలు వైసీపీలో అతి విశ్వాసాన్ని పెంచుతాయని కొందరు అంటున్నారు. కానీ జగన్ రాజకీయం వేరు అంటున్నారు వైసీపీ నేతలు. జగన్ ఇంతకు ముందులా కాదు. రాజకీయంగా రాటు దేలాడు. ప్రతి ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు. జనంలోకి తన సంక్షేమ పథకాలు పనిచేస్తున్నాయని సంకేతాలను పంపారు. గెలుపుకు కారణం ఏదైనా కావచ్చు. గెలుపు మాత్రం జగన్ ఖాతాలోనే పడింది. సంక్షేమ పథకాల వల్లనే ఇంతటి విజయాలు సాధ్యమయ్యాయని పార్టీ నేతలకు కూడా పరోక్షంగా హెచ్చరికలు పంపారు. తన మాటే వేదం. శాసనం అన్నది జగన్ ఈ ఫలితాలతో చెప్పకనే చెప్పారు. ఐదు మార్గాల నుంచి.... జగన్ కు అతి దగ్గరగా ఉన్న ఒక మంత్రి చెప్పిన దానిని బట్టి... జగన్ అధికారుల మాటలను నమ్మరు. తనకంటూ ఐదు రకాల సర్వే సంస్థలను జగన్ పెట్టుకున్నారు. ఐదు మార్గాల ద్వారా ఎప్పటికప్పుడు సర్వే నివేదికలు తెప్పించుకుంటాడు. ప్రజల్లో తన నిర్ణయంపై వ్యతిరేకత ఉందని ఆ సర్వేల్లో తేలితే వెంటనే నిర్ణయాన్ని మార్చుకోవడానికి కూడా వెనుకడారట. అంతెందుకు ఇంటలిజెన్స్ సర్వేలు, అధికారుల సంతృప్తి నివేదికలను జగన్ అసలు చూడనే చూడరంటున్నారు జగన్ కు సన్నిహితంగా ఉండే ఆ మంత్రి. ఇక జగన్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉందని గ్రహించారు. వారికి కొంత సమయం ఇవ్వనున్నారు. పనితీరు మార్చుకుని ప్రజల్లో విశ్వాసాన్ని పొందకపోతే నిర్దయగా వచ్చే ఎన్నికల బరి నుంచి తప్పించనున్నారు. ఈ మేరకు కొందరికి జగన్ సిగ్నల్స్ కూడా ఇచ్చారంటున్నారు. విజయాలను చూసి చంకలు గుద్దుకోవద్దని, ప్రజల్లో మార్పు ఒక్క రోజులో కూడా వస్తుందని జగన్ వారికి హెచ్చరికలు జారీ చేసినట్లు చెబుతున్నారు. మొత్తం మీద జగన్ ను తక్కువగా అంచనా వేస్తే తప్పులో కాలేసినట్లే. ఆయన వ్యూహాలు ఆయనకు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే జగన్ అందరినీ సిద్ధం చేస్తున్నారు.

## శివయ్య సన్నిధి లో సినీ గాయని కల్పన

శ్రీకాళహస్తి దక్షిణకాశీ గా పేరు గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయం లో సినీ గాయకురాలు కల్పన సోమవారం ప్రత్యేక రాహు కేతు సర్పదోష పూజ నిర్వహించుకున్నారు. అనంతరం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. పీఆర్వో హరియదవ్ ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. దక్షిణ మూర్తి వద్ద వేద పండితులచే ప్రత్యేక ఆశీర్వచనం అందుకున్నారు. కల్పనకు స్వామి. అమ్మవారి తీర్థప్రసాదాలు ఆలయ అధికారులు అందజేశారు.

## భవనంపై నుంచి పడి యువకుడి మృతి

రాయదుర్గం రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు భవనం పై నుండి పడి వ్యక్తి మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లా కు చెందిన చిరంజీవులు(28) కాజాగుడా లో నిర్మాణం లో ఉన్న భవనం పై సిమెంట్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం గచ్చిబౌలి లోని కేర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి ఈరోజు మృతి చెందాడు. చిరంజీవులు మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పోస్టుమార్టనికి తరలించారని ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు.

## ఐఐటీ నిపుణుల సూచనలతో సేఫేనా



తిరుమల, డిసెంబర్ 6, (న్యూస్ పల్స్) కలియుగ వైకుంఠం తిరుమలలో భారీవర్షాలు అపార నష్టాన్ని కలిగించిన సంగతి తెలిసిందే. తిరుమల కొండకు వెళ్ళే రెండవ ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు ఐఐటీ టీం. కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను గుర్తించడం, అవి విరిగి పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం, ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం నిర్మాణం అంశాలపై నివేదిక సమర్పించనుంది ఐఐటీ బృందం. తిరుమల ఘాట్ రోడ్డులో 10 సంవత్సరాలుగా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు రిటైర్డ్ ఛీఫ్ ఇంజనీర్ రామచంద్రారెడ్డి.పూర్తి స్థాయిలో పరిశీలన జరిపిన అనంతరమే తదుపరి చర్యలపై నివేదిక సమర్పిస్తామన్నారు. ప్రస్తుతం లింక్ రోడ్డు మీదుగా ట్రాఫిక్ మళ్ళించే అంశం పై దృష్టి సారించామన్నారు. మోకాలి మిట్ట నుంచి జియన్ సి వరకు సమాంతరంగా రోడ్డు నిర్మించే అంశాన్ని టీటీడీ దృష్టికి తీసుకువెళతాం అన్నారు రామచంద్రారెడ్డి. తిరుమలలో కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాలను పరిశీలించామన్నారు ఐఐటీ నిపుణుడు కేయస్ రావు.తుఫాను ప్రభావంతో ఊహించని విధంగా వర్షం కురవడంతో 40 నుంచి 50 టన్నులు బరువు వున్న బండరాలు జారిపడ్డాయన్నారు. రెండు మూడు నెలల కాలంలో సమస్యకు పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నామన్నారు. తిరుమల వెళ్ళే దారిలో 12 ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడే అవకాశాలు వున్నాయని గుర్తించామన్నారు. తిరుమల ఘాట్ రోడ్డు పటిష్టంగానే వుందని, రాక్ ఫాల్స్ కారణంగానే రోడ్డు డ్యామేజి జరిగిందన్న నిర్ధారణకు వచ్చారు. భవిష్యత్ అవసరాలు దృష్టిలో వుంచుకుని ప్రత్యామ్నాయంగా మరో రోడ్డు నిర్మాణం చెయ్యాలని సూచిస్తామని ఐఐటీ నిపుణులు చెప్పారు. వీరి సూచనలతో తిరుమల ఘాట్ రోడ్డు భద్రతా పరంగా పటిష్టంగా మారాలని భక్తులు కోరుకుంటున్నారు.

## మునిసిపల్ అధికారులతో టీడీపీ నేతల వాగ్వాదం

అనంతపురం అనంతపురంజిల్లా హిందూపురం పట్టణంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. రైల్వే రోడ్ లో ఉన్న తేదేపా మాజీ మున్సిపల్ ఛైర్మన్ రావేళ్ల లక్ష్మి స్థలం ప్రహరీ గోడను మున్సిపల్ అధికారులు కూల్చివేసారు. హిందూపురంలో తెలుగుదేశం పార్టీ నేతలే టార్గెట్ గా అధికారుల దాడులు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 40 ఏళ్లుగా మున్సిపాలిటీకి తమ స్థలంకి సంబంధించి టాక్స్ లు కట్టినప్పటికీ కేవలం రాజకీయ కక్షలో భాగంగా ప్రహరి గోడ ను కూల్చి చేశారని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు.హిందూపురం పట్టణంలోని రైల్వే రోడ్ లో మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ లక్ష్మి నాగరాజుకు చెందిన స్థలాన్ని రోడ్డు వెడల్పు లో భాగంగా మున్సిపల్ అధికారులు ఉద్దేశపూర్వకంగా ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చివేయడం పై కొద్దిసేపు అధికారులకు తెదేపా నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసు బలగాలను అడ్డంపెట్టుకుని తెదేపా నాయకులు టార్గెట్ చేస్తూ వారి ఆస్తులను ధ్వంసం చేయడం కోర్టుకు వెళ్లి న్యాయం కోసం పోరాటం చేస్తామని తెలిపారు.

# ఉప్పాడలో బీభత్సం

కాకినాడ, డిసెంబర్ 6, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ లోని ఉత్తరాంధ్రలో పాటు, గోదావరి జిల్లాలకు జవాద్ తుఫాన్ గండం అని హెచ్చరించిన నేపథ్యంలో ప్రజల్లో భయభ్రాంతులు నెలకొన్నాయి. అయితే ఏపీకి జవాద్ తూఫాన్ గండం తప్పింది. దీంతో ప్రభుత్వం, అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే.. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సమీపంలోని ఉప్పాడ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. రాత్రి నుండి ఉప్పాడ తీరం వెంబడి అలలతాకిడి అధికంగా ఉంది. జవాద్ తూఫాన్ .. దీనికి తోడు అమావాస్య తోడుకావడంతో సముద్రంలోని కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. ఉవ్వెత్తున్న విరుచుకు పడుతున్న అలల తాకిడికి ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు ధ్వంసమయింది. ఉప్పాడ-కాకినాడ ప్రధాన రహదారిలో పెద్ద బ్రిడ్జి కూలెందుకు సిద్దంగా ఉంది. దీంతో వాహనాల రాకపోకలకు ప్రమాదం పొంచి ఉంది. తీవ్ర అలల తాకిడికి పెద్ద బ్రిడ్జ్ ఒక పక్కకు ఒరిగింది. మరోవైపు బ్రిడ్జి రక్షణ గోడలకు బీటలు వారాయి. అధికారులు అప్రమత్తమయ్యి వెంటనే బ్రిడ్జి మీద నుంచి భారీ వాహనాలు రాకపోకలు నిలిపివేయక పోతే బ్రిడ్జి కూలిపోయో ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్రం అలల తాకిడికి ఉప్పాడ మార్కెట్ సెంటర్, మాయాపట్నం, కోనపా పేట వద్ద తీరం కోతకు గురవుతుంది. సముద్రం సమీపంలోని ఇల్లు, కొబ్బరి చెట్లు సముద్రంలో కలిసిపోతున్నాయి.

విశాఖలో అల్లకల్లోలం జొవాద్ తుఫాన్ కారణంగా విశాఖపట్నంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఆర్కే బీచ్‌లో సముద్రం ముందుకు దూసుకొచ్చింది. దీంతో బీచ్ వెంబడి భూమి కోతకు గురైంది. దుర్గాలమ్మ ఆలయం వరకు 200 మీటర్ల భూమి కోతకు గురవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు పలు చోట్ల భూమి కుంగిపోయింది. దీని ప్రభావంతో పిల్లల పార్కులోని ప్రహరీ గోడ కూలిపోయింది. బల్లలు విరిగిపోయాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆర్కే బీచ్‌లోకి పర్యాటకులను నిషేధించారు. ఎవరూ రాకుండా అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి సిబ్బందిని మోహరించారు. ఈ మేరకు అధికారులు పార్కుకు వచ్చే రహదారుల్ని మూసివేశారు. ఎవరిని లోపలికి అనుమతించకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. కాగా.. జొవాద్ తుఫాను నేపథ్యంలో సముద్రం ముందుకొచ్చి ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఒడిశాలోని పూరి తీరాన్ని తాకే అవకాశముంది. ఇది బలహీన పడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశమున్నట్లు ఐఎండీ పేర్కొంది. ఆ తరువాత ఉత్తర ఈశాన్య దిశగా ఒడిస్సా తీరం వెంబడి ప్రయాణం కొనసాగించి పశ్చిమ బెంగాల్ తీరం వైపునకు వెళ్లే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

మత్స్య కారుల పస్తులు జవాద్ తుఫాను మత్స్యకారులకు కష్టాలు మిగిల్చింది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని మత్స్యకారులు ఇళ్ళకే పరిమితం అయ్యారు. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం చేరుకున్నాయి ఎస్ డిఆర్‌ఎఫ్ బృందాలు. 44మంది సిబ్బందితో తీర ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో మత్స్యకారులు సముద్రతీరంలోకి వెళ్ళడం మానేశారు. ఇటు విజయనగరం జిల్లాలో తుపాన్ ఎఫెక్ట్ తో నాలుగు రోజులు గా వేటకి వెళ్లలేదు మత్స్యకారులు. అయినా అధికారులు తమను, తమ కుటుంబాలను పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు మత్స్యకారులు. నెల్లిమర్ల నియోజకవర్గంలో కనీసం నిత్యావసర సరుకులు కూడా ఇవ్వకపోవడంతో పస్తులు ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మత్స్యకారులు. అధికారులు రోజూ వచ్చి వేటకు వెళ్ళామో లేదో అని తెప్పలు చెక్ చేస్తున్నారు తప్ప తమ బాగోగులు పట్టించుకోవడం లేదంటున్నారు జాలర్లు. మరోవైపు తుఫాను ముప్పు తప్పినా తీరప్రాంతంలో కాకినాడ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. కాకినాడ బీచ్ రోడ్డు వైపు, ఉప్పాడ వెళ్లే బీచ్ రోడ్ లోనూ రాకాసి సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. కాకినాడ బీచ్ రోడ్డు పైకి సముద్రపు అలలు వచ్చి పడుతున్నాయి. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇదిలా వుంటే.. తుపాన్ దిశను మార్చుకుని ఒడిశా వైపుగా 5వ తేదీ మధ్యాహ్నానికి పూరీ వద్ద తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర, ఈశాన్య దిశగా తిరిగి ఒడిశా తీరం వెంబడి ఈ తుఫాన్ పూరీకి చేరుకుంటుందని భావిస్తున్నారు. అనంతరం బలహీన పడి తీవ్ర వాయుగుండంగా ఒడిశా తీరం మీదుగా పశ్చిమ బెంగాల్ వైపు పయనించే అవకాశాలున్నాయి. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా తీరంలో ఇవాళ గంటకు 110 కి.మీ గరిష్ట వేగంతో గాలులు వీచే అవకాశాలున్నాయి. ఉత్తరాంధ్రకు భారీ ముప్పు తప్పినా.. మత్స్యకారుల చేపల వేటపై ఆంక్షలు కొనసాగుతున్నాయి.

## ఫైర్ బ్రాండ్ చూట్టూ ఉచ్చు



విజయవాడ, డిసెంబర్ 6, (న్యూస్ పల్స్) కొడాలి నాని... ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్. నాని మీడియా సమావేశం అంటే.. చంద్రబాబును ఏకి పారేస్తారు. వ్యక్తిగతంగా మాటల దాడికి దిగుతారు. చంద్రబాబు ను టార్గెట్ చేస్తారు. ఇప్పుడే కాదు చంద్రబాబుపై 2014 ఎన్నికలకు ముందు నుంచి కొడాలి నాని వ్యక్తిగత విమర్శలు చేస్తూ వచ్చారు. కొడాలి నాని వైసీపీలో చేరిన నాటి నుంచి చంద్రబాబు పై ఒంటికాలిమీద లేచినా నందమూరి నడిగడ్డ మీద విజయం సాధిస్తూనే ఉన్నారు. గుడివాడ అంటేనే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు సొంత గడ్డ. ఆ గడ్డ మీద దశాబ్దకాలంగా పసుపు జెండాను కొడాలి నాని మాయం చేశారు. మరి కొడాలి నానికి కమ్మ సామాజికవర్గం అండలేదా? అంటే అవునని చెప్పలేం. కాదని అనలేం. ఎందుకంటే గుడివాడలో కమ్మ సామాజికవర్గం ఓట్లు 15 వేలు మాత్రమే. ఇక్కడ బీసీ, కాపులు, మైనారిటీ, ఎస్సీ సామాజికవర్గ ఓటర్లు ఎక్కువగా ఉన్నాయి. గుడివాడలో కొడాలి నానికి కమ్మ సామాజికవర్గం నుంచి కూడా పెద్దగా వ్యతిరేకత లేదు. ఆయనతో దగ్గర బంధుత్వాలే ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు నాని నిత్యం జనంలో ఉంటారు. గుడవాడ ప్రజల తరువాతనే తనకు ఎవరైనా అని ఆయన బహిరంగంగానే చెప్పారు. నాని కుటుంబానికి కూడా మంచి పేరు ఉండటం కలసి వచ్చింది. అందువల్లనే కొడాలి నానిని బూతుల మంత్రిగా చిత్రీకరించినా ఆయన లైట్ గా తీసుకుంటున్నారు.

# కుప్పం పై పోస్టు మార్టం...

తిరుపతి, డిసెంబర్ 6,(న్యూస్ పల్స్) ఏపీలో జరిగిన రెండో విడత మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై టీడీపీ విశ్లేషణ చేస్తోంది. మరి.. కుప్పంలో ఓటమిపై చంద్రబాబు పోస్టుమార్టం చేస్తారా? ఆ దిశగా ఆలోచన ఉందా? పార్టీ ఆఫీస్‌కు వస్తున్న తమ్ముళ్లు వేస్తున్న ప్రశ్నలేంటి? మొదటి విడతలో ఏపీలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించడంతో ఆ ఫలితాలపై విశ్లేషణ చేసుకోవాల్సిన అవసరం లేదని భావించింది టీడీపీ. రెండో విడతలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మాత్రం పార్టీ అన్ని ఎఫర్ట్స్ పెట్టింది. గట్టిగా పోరాడే ప్రయత్నం చేసింది. దీనికి తగ్గట్టే రెండు మున్సిపాల్టీలను చేజిక్కించుకుంది. గతంతో పోల్చుకుంటే వైసీపీని బాగానే ఎదుర్కొన్నామనే ఫీలింగ్ పార్టీ వర్గాల్లో కనిపించింది. కాకపోతే కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో ఓటమితో.. ఓవరాల్‌గా టీడీపీ ఘోరంగా ఓడిపోయిందనే చర్చ జరిగింది. ఈ క్రమంలో రెండో విడత ఎన్నికల్లో స్థానిక నేతల పని తీరు.. ఆయా నియోజకవర్గాల్లో పరిస్థితిపై విశ్లేషణ మొదలుపెట్టింది టీడీపీ. అధినేత చంద్రబాబు స్వయంగా సమావేశాల్లో పాల్గొంటున్నారు. కార్యకర్తలు, నేతల అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు కూడా. ఈ సందర్భంగా ఆయన కొన్ని సలహాలు.. సూచనలు చేస్తున్నారు. రెండు రోజులుగా ఏపీ టీడీపీ ఆఫీసులో ఇదే తంతు కొనసాగుతోంది. ఈ విశ్లేషణలు అన్నింటికంటే.. కుప్పం మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై పోస్ట్‌మార్టం చేస్తున్నారా? లేదా అని ఆరా తీస్తున్నారట. కుప్పం మున్సిపాల్టీలో 25 వార్డుల్లో 19చోట్ల వైసీపీ గెలుచుకుంది. టీడీపీకి దక్కింది ఆరు వార్డులే. ఆ ఎన్నికల్లో టీడీపీ గట్టి పోటీ ఇచ్చిన పరిస్థితి లేదనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో ఉందట. దీంతో తన నియోజకవర్గంలో ఓటమికి చంద్రబాబు ఎవరిని తప్పు పడతారు? ఎవర్ని బాధ్యులను చేస్తారనేది ఆసక్తిగా మారింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. ప్రత్యర్థి ఎన్ని కుట్రలు పన్నినా గెలవాలనే సంకల్పం, పట్టుదల ఉంటే గెలవొచ్చని గురజాల, దాచేపల్లి మున్సిపల్ విశ్లేషణల సందర్భంగా చంద్రబాబు కార్యకర్తలకు.. నేతలకు దిశా నిర్దేశం చేశారట. ఈ క్రమంలో అదే ఫార్మూలాను కుప్పానికి ఎందుకు అప్లై చేయలేదనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోందట. కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో ఓటమికి ప్రధాన కారణాల్లో అధికార పార్టీ బలం.. అధికారుల సహకారం.. డబ్బుల పంపిణీ.. దొంగ ఓటర్ల తరలింపు అని ఎన్ని విమర్శలు చేసినా.. చంద్రబాబు సొంత నియోజకవర్గంలో వీటిని ఛేధించలేనంత నిస్సహాయతలో పార్టీ.. పార్టీ నేతలు ఉన్నారా..? అంటే ముఖ్య నాయకుల్లో మాత్రం మౌనమే సమాధానంగా వస్తోంది. అయితే కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ ఓటమికి ఆ పార్టీ చెప్పే కారణాల సంగతేమో కానీ.. అంతకు మించిన లోపాలు పార్టీపరంగా కుప్పంలో చాలా ఉన్నాయనే అంటున్నారు. స్థానికంగా పార్టీ నేతలు.. ఎవర్ని అయితే ఇన్ఛార్జులుగా నియమించి చంద్రబాబు బాధ్యతలు అప్పజెప్పారో వాళ్లే ఓటమికి ప్రధాన కారణమనే చర్చ ప్రస్తుతం పార్టీ వర్గాల్లో జరుగుతోందట. ఈ అంశాలను ప్రభావితం చేసేలా వైసీపీ లోపాయికారీగా ప్రచారం చేయడం వల్ల కూడా కుప్పంలో ఓడిపోయామనే భావన వ్యక్తం అవుతోందట. ఇన్ఛార్జులుగా బాధ్యతలు తీసుకుని.. ఇష్టానుసారం వ్యవహరించిన ఓ ఐదుగురు నేతల ఓవరాక్షన్.. వారి వ్యవహార శైలి వల్లే పరిస్థితి చేజారిందనే చర్చ ఉందట. స్థానిక నేతల వ్యవహారం చంద్రబాబు తెలియజేయాలంటే మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీకి ఓటేస్తేనే బెటరని చాలామంది భావించినట్టు సమాచారం. ఎలాగూ ఆ ఎన్నికల్లో చంద్రబాబు పోటీ చేయడం లేదు కదా.. సాధారణ ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటేసుకోవచ్చనే భావన కలిగేలా.. రాజకీయం జరిగిందని టాక్. ఆ క్రమంలో కుప్పం ఓటమికి బాధ్యులైన ఆ ఇన్ఛార్జుల విషయంలో చంద్రబాబు ఏం మాట్లడతారు..? వారిని తప్పించి వేరే ఎవరికైనా బాధ్యతలు అప్పజెబుతారా..? లేదా పాత విధానాన్నే కంటిన్యూ చేస్తారా..? అనేది చూడాలి.

## మహిళ దారుణ హత్య

అనంతపురం మహిళను బండరాళ్లతో కొట్టి దారుణంగా హత్య చేసిన సంఘటన రాయదుర్గం మండలంలో చోటుచేసుకుంది. అనంతపురం జిల్లా రాయదుర్గం మండలంలోని చదం తమ్మేపల్లి రహదారి పక్కన పంట పొలాల్లో గుర్తుతెలియని మహిళ దారుణ హత్యకు గురైంది మొహం పై బండరాళ్లతో మోది చంపారు. మహిళ వయసు సుమారు 46 ఏళ్లు ఉండవచ్చుని తెలుస్తోంది. ఆదివారం సాయంత్రం గుర్తించిన స్థానికులు రాయదుర్గం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సిఐ సురేష్ బాబు ఘటన స్థలానికి చేరుకొని హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అప్రమత్తతే అనివార్యం

హైదరాబాద్, డిసెంబర్ 6, భారత్‌లో ఒమిక్రాన్ కలకలం. ఇండియాలో రెండు ఒమిక్రాన్ కేసులు నమోదు. విదేశాల నుంచి వచ్చిన ఇద్దరికి ఒమిక్రాన్ నిర్ధారించారు. ప్రపంచ దేశాల గుండెల్లో ఒమిక్రాన్ గుబులు పుట్టిస్తోంది. దాదాపు రెండేళ్లుగా వైరస్?తో సతమతమవుతున్న ప్రజలు.. ఇప్పుడు మరో ఉపద్రవం ముంచుకొస్తుందన్న వార్తలతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. నిజంగా కొవిడ్-19 కొత్త వేరియంట్ ఒమిక్రాన్ అంత ప్రమాదకరమా? 26 నవంబర్ 2021న, వైరస్ ఎవల్యూషన్‌పై డబ్ల్యూహెచ్‌ఓ టెక్నికల్ అడ్వైజరీ గ్రూప్ దక్షిణ ఆఫ్రికా లో ఒమిక్రాన్ ః.1.1.529 అనే వేరియంట్ ఉందనేది వాస్తవమేనని నిర్ధారించింది. ఒమిక్రాన్ అనేక ఉత్పరివర్తనాలను కలిగి ఉందని శరీరంలో దీని ప్రభావం ఎలా వుంటుందో వివరించింది. దక్షిణాఫ్రికా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు ఒమిక్రాన్ యొక్క అనేక అంశాలను బాగా అర్థం చేసుకోవడానికి అధ్యయనాలు నిర్వహిస్తున్నారు. డెల్టాతో సహా ఇతర వేరియంట్‌లతో పోలిస్తే ఒమిక్రాన్ మరింతగా వ్యాపిస్తుంది. ఒక వ్యక్తి నుండి వ్యక్తికి మరింత సులభంగా వ్యాపిస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ వేరియంట్ ద్వారా ప్రభావితమైన దక్షిణాఫ్రికా ప్రాంతాలలో పాజిటివ్‌ని పరీక్షించే వ్యక్తుల సంఖ్య పెరిగింది, అయితే ఇది ఓమిక్రాన్ లేదా ఇతర కారణాల వల్ల జరిగిందా అని అర్థం చేసుకోవడానికి ఎపిడెమియోలాజికల్ అధ్యయనాలు జరుగుతున్నాయి. డెల్టాతో సహా ఇతర రకాల ఇన్ఫెక్షన్‌లతో పోలిస్తే ఒమిక్రాన్ తో సంక్రమణ మరింత తీవ్రమైన వ్యాధిని కలిగిస్తుందా అనేది ఇంకా స్పష్టంగా తెలియలేదు. దక్షిణాఫ్రికాలో ఆసుపత్రిలో చేరే వారి సంఖ్య పెరుగుతోందని ప్రాథమిక డేటా సూచిస్తుంది. ఒమిక్రాన్తో మళ్లీ ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉందని ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయి. అంతేకాదు వ్యాక్సిన్ వేసుకున్నంత మాత్రాన ఒమిక్రాన్ సోకదని చెప్పలేం. అయితే, వ్యాక్సిన్‌లు తీవ్రమైన వ్యాధి మరియు మరణాలను తగ్గించడంలో కీలకంగా ఉంటాయి, వీటిలో ప్రబలమైన సర్క్యులేటింగ్ వేరియంట్ డెల్టాకు వ్యతిరేకంగా ఉంటుంది. ప్రస్తుత టీకాలు తీవ్రమైన వ్యాధి మరణాలకు వ్యతిరేకంగా ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని తేలింది. తీవ్రమైన కోవిడ్-19 ఉన్న రోగులను నిర్వహించడానికి కార్టికోస్టెరాయిడ్స్, ఎఒ6 రిసెప్టర్ బ్లాకర్స్ ఇప్పటికీ ప్రభావవంతంగా పనిచేస్తున్నాయి. ఇతర చికిత్సలు ఒమిక్రాన్ వేరియంట్‌లో వైరస్ యొక్క భాగాలకు చేసిన మార్పులను బట్టి అవి ఇప్పటికీ ప్రభావవంతంగా ఉన్నాయో లేదో తెలుసుకోవాల్సి వుంది. కోవిడ్-19 వైరస్ వ్యాప్తిని తగ్గించడానికి వ్యక్తులు తీసుకోగల అత్యంత ప్రభావవంతమైన చర్యలు తీసుకోవాలి. ఇతరుల నుండి కనీసం 1 మీటర్ భౌతిక దూరం పాటించాలి. మాస్క్ తప్పనిసరిగా ధరించాలి. వెంటిలేషన్ మెరుగుపరచడానికి విండోలను తెరవాలి. సాధ్యమయినంత మేరకు రద్దీగా ఉండే ప్రదేశాలను నివారించాలి. చేతులు శుభ్రంగా ఉంచడం, వంగిన మోచేయి లేదా కణజాలంలోకి దగ్గు లేదా తుమ్మడం, టీకాలు వేయించుకోవాలి.

త్వరలో నైట్ కర్ఫ్యూ కరోనా కొత్త వేరియంట్ ఒమిక్రాన్ మరోసారి ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోంది. అంతా నార్మల్ లైఫ్‌లోకి వెళ్లబోన్నామనుకున్న టైమ్‌లో ఈ వేరియంట్ చుట్టుముడుతోంది. ఒమిక్రాన్ చాలా వేగంగా వ్యాప్తి చెందుతుందని, ఇమ్యూనిటీని సైతం ఛేదించి వైరస్ అంటుకుంటుందని డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది. వ్యాక్సిన్లు కూడా అడ్డుకోలేకపోవచ్చని చెబుతున్న నేపథ్యంలో థర్డ్ వేవ్ వస్తుందా? మళ్లీ లాక్‌డౌన్ తప్పదా? అన్న టెన్షన్ జనాన్ని చుట్టుముట్టేస్తోంది. భారత్‌లో కరోనా మహమ్మారి గ్రాఫ్‌ను మ్యాథమేటికల్‌గా అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సూత్ర' గ్రూప్ కో ఫౌండర్, ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ మణీంద్ర అగర్వాల్ ఈ ప్రశ్నలకు సమాధానమిచ్చేలా తమ స్టడీ వివరాలను వెల్లడించారు. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి మధ్య కరోనా థర్డ్ వేవ్ పీక్‌కు చేరే అవకాశం ఉందని తెలిపారు. అయితే ఈ థర్డ్ వేవ్ ఎక్కువ తీవ్రంగా ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నామన్నారు. ఒమిక్రాన్ వేరియంట్ కేసులు వచ్చే ఏడాది తొలినాళ్లలో పీక్‌కు చేరుతాయని తమ స్టడీలో తేలిందని మణీంద్ర అగర్వాల్ చెప్పారు. అయితే ఈ వేరియంట్ గురించి భయపడాల్సిన అవసరం లేదని, జాగ్రత్తలు పాటిస్తే చాలని సూచించారు. అయితే ఒమిక్రాన్‌పై సౌతాఫ్రికా రీసెర్స్‌కు భిన్నంగా మణీంద్ర అగర్వాల్ టీమ్ అధ్యయన ఫలితాలు ఉన్నాయి. ఈ వేరియంట్ రోగ నిరోధక శక్తిని ఛేదించి, వైరస్ సోకే ప్రమాదం ఉందన్న సౌతాఫ్రికా రీసెర్చ్‌ను కొట్టిపారేశారు అగర్వాల్. ఇమ్యూనిటీని బైపాస్ చేసే శక్తి ఒమిక్రాన్‌కు లేదని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఒమిక్రాన్ సోకిన వారిలో ఎక్కడా క్రిటికల్ కండిషన్‌కు చేరిన దాఖలాలు లేవని చెప్పారు. ఇప్పటి వరకూ సేకరించిన డేటా ఆధారంగా ఒమిక్రాన్ వ్యాప్తి వేగంగా ఉన్నప్పటికీ.. వైరస్ సోకిన తర్వాత తేలికపాటి లక్షణాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించామన్నారు. దేశంలో థర్డ్ వేవ్ రావడం దాదాపు ఖాయమని మణీంద్ర అగర్వాల్ తెలిపారు. అయితే ఈ థర్డ్ వేవ్ ఏ స్థాయిలో ఉంటుందన్నది ప్రభుత్వాలు హ్యాండిల్ చేసే విధానాన్ని బట్టి ఆధారపడి ఉంటుందని చెప్పారు. వైరస్ వేగంగా వ్యాప్తి చెందకుండా కంట్రోల చేసేందుకు తేలికపాటి ఆంక్షలతో కూడిన లాక్‌డౌన్స్ తప్పవని పేర్కొన్నారు. కేసులు భారీగా పెరిగిపోకుండా ఉండేందుకు గుంపులు కంట్రోల్ చేసేందుకు మీటింగ్‌లు, సంబురాలపై ఆంక్షలు, నైట్ కర్ఫ్యూలు విధిస్తే మేలని సూచించారు.

## చెవి కమ్మల కోసం వృద్ధురాలి గొంతుకోసిన దొంగలు

మంగళగిరి ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలి గొంతుకోసి బంగారు చెవి పోగులను గుర్తు తెలియని దుండగులు దోచుకెల్లారు. ఈ ఘటన గుంటూరు జిల్లా మంగళగిరి పరిధిలోని పెద వడ్లపూడిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడి గ్రామానికి చెందిన వృద్ధురాలు లక్ష్మీ మనోహరమ్మ ఒంటరిగా వుంటోంది. ఈ విషయం తెలిసిన గుర్తుతెలియని ముగ్గురు దుండగులు రాత్రి నిద్రిస్తున్న వృద్ధురాలిపై దాడి చేసారు. భయపడిపోయినబాధితురాలుకేకలువేసింది. దాంతో దుండగులు రెచ్చిపోయి ఆమె ఆమె గొంతు కోసారు. చెవికి ఉన్న బంగారం పోగులను బలవంతంగా లాక్కొని పారిపోయారు. రక్తపు మడుగులో అపస్మారక స్థితిలో పడి ఉన్నవృద్ధురాలిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

## విశాఖలో అంబెద్కర్ వర్ధంతి

విశాఖపట్నం రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబెద్కర్ వర్ధంతి సందర్భంగా ఎల్.ఐ. సి కూడలి డాబా గార్డెన్ లో అంబెద్కర్ విగ్రహానికి పులమాలతో నివాళులు అర్పించిన పలు రాజకీయ పార్టీకి చెందిన నేతలు నాయకులు పాల్గొని అంబెద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం రాష్ట్ర పర్యటకశేఖ మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ దళితులకు పెద్ద పీట వేసిన ప్రభుత్వం ఏదయినా ఉంది అంటే అది కేవలం వైసీపీ ప్రభుత్వం మాత్రమే అని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబసాహెబ్ అంబెద్కర్ అసయలకు అనుగుణంగా నడుచుకుంటు ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలని ఆయన ఆశయాలను నెరేవేరుస్తేనే ఆయనకు మనం ఇచ్చే అసలైన నివాళులు అని తెలిపారు అందులో భాగంగానే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈరోజు దళితులకు పెద్దపీట వేస్తూ అని పదవుల్లో దళితులకు న్యాయం చేస్తున్నారని తెలిపారు

# అణగారిన వర్గాల అభ్యున్నతికి బాటలు వేసిన అంబేద్కర్

**- ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్**

విజయవాడ భారత రాజ్యంగ రూపకర్త డా. బి. ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ఇందిరా భవన్ లో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ అంబేద్కర్ చేసిన సేవల్ని స్మరించుకోవాలని, భావి సమాజానికి ఆ మహోన్నత వ్యక్తి నెలకొల్పిన విలువల్ని అందించాలన్నారు. దేశంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి బాటలు వేసి, నేడు వెనుకబడిన, బలహీన వర్గాలు స్వయం సంవృద్ధి దిశగా రాణించడానికి కారకుడు బాబా సాహెబ్ అంబేద్కర్ అని అన్నారు. స్వేచ్ఛ, సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమన్యాయం దేశ ప్రజలందరికీ అందించడమే అసలైన అభివృద్ధి అని చెప్పిన మహనీయులు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ అని శైలజనాథ్ అన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ ముందుకు వెళ్లాల్సిన పాలకులు అందుకు భిన్నంగా ఎస్సీ ఎస్టీ సంక్షేమం నిధులను సైతం పక్కదోవ పట్టిస్తున్నారని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా పాలకులు కళ్ళు తెరవాలని, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం పాటుపడాలని ఆయన కోరారు. డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ మహనీయుని ముందు చూపువల్లే నేడు మన దేశంలో రిజర్వేషన్లు అమలవుతున్నాయని, అందువల్లే సమాజంలో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలకు అవకాశాలు లభిస్తున్నాయన్నారు.



## నిరాహార దీక్ష కు దిగిన అపోలో పరిశ్రమ భూ బాధిత రైతులు

చిత్తూరు చిత్తూరు జిల్లా వరదయ్యపాళెం మండలంలోని అపోలో పరిశ్రమ కు భూములు ఇచ్చిన భూ భాదితులు (పరిహారం అందని 91మంది) నిరాహార దీక్షకు సిద్ధమై అపోలో పరిశ్రమ వద్దకు వెళుతుండగా అధికారులు అడ్డుకున్నారు. చిన్నపాండూరు వద్దే సంత నిర్వహించే మైదానంలో నిరాహార దీక్షకు దిగారు. గత ఏడు సంవత్సరాలుగా కాళ్ళు అరిగేటట్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిహారం అందించడంలోజాప్యం చేస్తున్నారని ఆగ్రహంతో నిరాహార దీక్ష కు దిగామని భాదితులు అంటున్నారు. అపోలో పరిశ్రమ ఏర్పడినప్పటినుండి ఎవరైతే పరిశ్రమకు భూములు ఇచ్చారో వారి కుటుంబాలకు ఉద్యోగాలు కూడా ఇవ్వటం లేదని... పరిహారం అందక ఓ వైపు తమ పిల్లలకు ఉపాధి కల్పన లేక ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతున్నామని వెంటనే తమకు పరిహారం ఇవ్వాలని మరియు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయండి

కౌతాళం ( విభారె) కౌతాళం మండలం లో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా యం ఆర్ పి యస్ మండల అధ్యక్షులు రాజా బాబు అధ్వర్యంలో ఘననివాళులుఅర్పించారు ఈ కార్యక్రమంలో దళిత నాయకులు సల్మాన్ రాజు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ మన మధ్య లో లేకపోయిన ఆయన రాసిన రాజ్యాంగం మన మధ్య నే వుంది అని వాడు కొనియాడుతూ అనేక అధ్యయనాలు చేసి మన దేశానికి రాసిన రాజ్యాంగం గొప్పది అని బడుగు బలహీన వర్గాలకు మార్గదర్శి మన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అని వారు అన్నారు రెండు నిమిషాలు మౌనం పాటించి పూలమాల వేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో మండల ప్రదాన కార్యదర్శి ఉప్పురాళ్ల శేఖర్, రౌడూరు ముఖేష్, సునీల్, ఉసేని, ఫీలిపు, రంగస్వామి, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు

# కులాల కుళ్లును కడిగేద్దాం

## – అంబేద్కర్ ఆశయాలను సాధిద్దాం : ఏబీవీపీ



ఎమ్మిగనూరు ( విభారె) పట్టణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబెడ్కర్ వర్ధంతి సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలో అంబెడ్కర్ విగ్రహానికి ఏబీవీపీ బాగ్ కన్వీనర్ చిన్నబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ అందరివాడని,అంబేద్కర్ ఒక కులానికో..ఒక వర్గానికో పరిమితమైన వ్యక్తి కాదని అన్నారు. అట్టడుగు వర్గాల వారి అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్. కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపి, అక్షరాన్ని ఆయుధంగ మలిచి, జ్ఞానాన్ని ప్రపంచ ఎల్లలు దాటించిన మహోన్నత వ్యక్తి అంబేద్కరని కొనియాడారు. అంబేద్కర్ రచన వల్లే రాజ్యాంగం ఏర్పాటు సాధ్యమైందని భారతీయులమైన మనం.. దేశ పౌరులందరికీ రక్షణగా.. భారతదేశాన్ని సార్వభౌమ, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాన్ని నెలకొలిపేందుకు.. రాజ్యాంగాన్ని గౌరవిద్దాం.. ముందు తరాలకూ ఆ ఫలాలను అందిద్దామని అన్నారు. ఆయన మన దేశానికి అందించిన రాంజ్యాంగం ప్రపంచ దేశాల్లో అత్యున్నతంగా నిలిచింది. మనమందరం కలిసి అంబెడ్కర్ భావన నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగన్న , హనుమంతు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# సూర్యప్రభ వాహనంపై వేణుగోపాలుడి అలంకారంలో సిరులతల్లి

తిరుపతి ( విభారె)తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన సోమవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై వేణుగోపాలకృష్ణుడి అలంకారంలోశ్రీ పద్మావతి అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయం వద్దగల వాహన మండపంలో ఉదయం 8 నుండి 9 గంటల వరకు అమ్మవారి వాహనసేవ ఏకాంతంగా జరిగింది. సూర్యభగవానుడు ప్రత్యక్ష నారాయణుడు. లక్ష్మీ సమేతుడైన శ్రీమన్నారాయణుడు సూర్యమండలాంతర్గతుడై వెలుగొందుతున్నాడని ఉపనిషత్తులు పేర్కొంటున్నాయి. సూర్యభగవానుని కిరణస్పర్శతో పద్మాలు వికసిస్తాయి. అలాంటి పద్మాలే లక్ష్మికి నివాసస్థానాలు. సూర్యనారాయణుని సాక్షిగా తిరుచానూరులో శ్రీవారు తపమాచరించి కృతార్థులయ్యారు. సూర్యప్రభ వాహనంలో అమ్మవారి దర్శనం ఆరోగ్యం, ఐశ్వర్యం, సత్సంతానం, సుజ్ఞానం మొదలైన ఫలాలను పరిపూర్ణంగా ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం.అమ్మవారికి గాజులు విరాళం తిరుపతికి చెందిన శ్రీ పొన్నాల సుధాకర్, శ్రీ ఉదయ్ అనే భక్తులు సోమవారం ఉదయం 100 డజన్ల గాజులు, హుండీ బట్టలు విరాళంగా అందించారు. వీటిని జెఈఓ శ్రీ వీరబ్రహ్మంకు అందజేశారు. వాహనసేవలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, జెఈఓ శ్రీ వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి కస్తూరిబాయి,



ఏఈవో శ్రీ ప్రభాకర్ రెడ్డి, పాంచరాత్ర ఆగమసలహాదారు శ్రీ శ్రీనివాసాచార్యులు, అర్చకులు శ్రీ బాబుస్వామి, సూపరింటెండెంట్లు శ్రీ శేషగిరి, శ్రీ మధుసూధన్, ఏవిఎస్వో శ్రీ వెంకటరమణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ రాజేష్ కన్నా పాల్గొన్నారు..

## కెవికె బనవాసి లో ప్రపంచ నేలల దినోత్సవం

ఎమ్మిగనూరు( విభారె) యల్లయ్య: కెవికె బనవాసి లో రైతులు, రైతుమహిళలు, విద్యార్థులు సమక్షంలో ప్రపంచ నేలల దినోత్సవం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ ) వారి సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవికె సమన్వయకర్త డా. టి. శ్రీనివాస్, శాస్త్రవేత్తలు యం. జయలక్ష్మి, డా.జి. ప్రసాద్ బాబు, ఎమ్మిగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు డి. జమ్మన్న, ఆత్మ వ్యవసాయ అధికారిని మధుమతి,బోధనేశ్వర సిబ్బంది పాల్గొన్న ముఖ్య అతిథులు కెవికె సమన్వయకర్త డా టి. శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక అంగుళం నేల ఏర్పడటానికి దాదాపు 5000 సంవత్సరాలు పడుతుంది కనుక నేలను సంరక్షించుకునే మార్గలైనటువంటి ప్లాస్టిక్ నిషేధం, సేంద్రియ ఎరువులయినటువంటి పచ్చిరొట్ట పైర్లు (జనుము, జీలుగ, ఉలవ, అలసంద, పిల్లిపెసర) వాడకం, పేడ ఎరువు, వానపాముల ఎరువు, కోళ్ల ఎరువు, గొర్రెల ఎరువు, జీవన ఎరువులు, వాడకం పెంచి రసాయన ఎరువులను సిఫారసు చేసిన మేరకే వాడాలని తెలియజేసారు. అలాగే రైతులు భూసార పరీక్ష చేసుకొని తధనుగుణంగా ఎరువుల వాడుకోవాలని తెలియజేసారు. ఏడీఏ జమ్మన్న మాట్లాడుతూ పౌరులందరూ చెట్లను పెంచి కాలుష్యాన్ని తగ్గించాలని, నేల సారవంతతను పెంచేలోతుదుక్కులను చెప్పేట్టాలని తెలియ జేసారు. తరువాత శాస్త్రవేత్తలు యం. జయలక్ష్మి, డా. జి. ప్రసాద్ బాబు నేల సంరక్షణ పై క్విజ్ నిర్వహించి విజేతలకు వ్యవసాయ పంచాంగాలను బహుమతిగా అందివ్వడం జరిగింది. అలాగే మట్టినమూనా లా సేకరణ పై విధాన ప్రదర్శనను నిర్వహించారు. అలాగే మట్టిపరీక్షల చేసే విధానాన్ని ప్రయోగశాలలో ప్రత్యక్ష పద్ధతులు ద్వారా చూపించారు.

# వినతిదారుల నుండి 12 వినతులు అందినాయి

నంద్యాల డిసెంబర్ 6 ( విభారె) :-వినతిదారుల నుండి 12 వినతులు అందినాయి అని నంద్యాల సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి హరినాథ్ రావు అన్నారు.సోమవారం నంద్యాల సబ్ కలెక్టర్ కార్యాలయం లో వినతిదారుల నుండి నంద్యాల సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి హరినాథ్ రావు వినతులు స్వీకరించారు.అనంతరం నంద్యాల సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి హరినాథ్ రావు మాట్లాడుతూ ఈరోజు జరిగిన కార్యక్రమంలో కోవిడ్ నిబంధనలు పాటించుతూ వినతిదారుల నుండి వినతులు స్వీకరించినామని అన్నారు. వినతి దారులకు ముఖ్యంగా తెలియజేయడమేమనగా మీ పరిధిలోని సచివాలయం నందు మరియు మండల తహశీల్దార్ వారి కార్యాలయం నందు కూడా వినతులు స్వీకరించబడతాయి అక్కడ పరిష్కారం దొరకనప్పుడు మాత్రమే డివిజన్ లోని సబ్ కలెక్టర్ కార్యాలయం నకు రావాలన్నారు .సిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల గ్రామం నివాసి బోయపల్లె రామ కృష్ణ మూర్తి సర్వే నంబర్ 82/2ం లోని ఒక్క ఎకరా 36 సెంట్ల భూమి 18 వ నెంబర్ జాతీయ రహదారి లో భూసేకరణ కింద ప్రభుత్వం తీసుకుని ఉన్నది కానీ నాకు ఇంత వరకు ప్రతిఫలం అందలేదు కావున దయతో న్యాయం చేయండి.సిరివెళ్ల మండలం

## అందిన వినతులను సత్వరమే పరిష్కరిస్తాము

గుంపరమందిన్నె గ్రామ నివాసి తలారి పూర్ణ చంద్రుడు. నాకు జీనేపల్లె గ్రామ సమీపంలోని సర్వే నెంబర్ 23 నందు ఒక్క ఎకరా 50 సెంట్లు భూమి కి పాసు పుస్తకాలు ఇచ్చినారు కానీ భూమిని ఆన్లైన్లో నమోదు చేయలేదు దయతో నమోదు చేయించగలరు.పాణ్యం మండలం భూపనపాడు గ్రామనివాసి రామాంజనేయులు నాకు ఐదు ఎకరాల భూమి పిత్రార్జితము గా లభించినది కానీ ఆన్లైన్లో నమోదు చేయలేదు దయతో నమోదు చేయించగలరుఈ కార్యక్రమానికి ఎక్కువ శాతం భూ తగాదాల గురించి. భూములను ఆన్లైన్లో నమోదు చేయించాలని. భూములను ఆక్రమించుకున్నారని అడంగల్ నందు భూముల వివరాలు నమోదు చేయాలని. వృద్ధాప్య పింఛన్ .వికలాంగుల పింఛన్లు నిలుపుదల చేశారని తదితర వినతులు అందినాయి అన్నారు. ఈరోజు కార్యక్రమానికి 12 వినతులు అందినాయని అన్నారు.ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ సి డి పి ఓ చంద్రకళ. సూపర్వైజర్ కనక సుజాతమ్మ . డి ఆర్ డి ఎ అసిస్టెంట్ మేనేజర్ బాబురావు. ఆర్డబ్ల్యూఎస్. ఏ టి వో .నబిరసూల్.



డివిజనల్ పంచాయతీ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రిజ్ వాన్ ఖాతర్. తహసీల్దార్ లు వెంకటేశ్వర్లు. మహమ్మద్ రఫీ. డి ఐ ఓ రవీంద్ర పాల్. హౌసింగ్ సిబ్బంది రామ సుబ్బారెడ్డి. నంద్యాల శాఖ గ్రంథాలయ అధికారి బషీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# బంగార్రాజు' నుంచి 'నా కోసం' సాంగ్ విడుదల




బంగార్రాజు చిత్రయూనిట్ మొదటి నుండి విభిన్నంగా ప్రమోషన్స్ చేస్తున్నారు. సినిమా ఫస్ట్ లుక్, పోస్టర్స్, ఫస్ట్ సింగిల్ లడ్డుండా ఇలా ప్రతీ ఒక్కదానికి విశేషమైన స్పందన లభించింది, కింగ్ అక్కినేని నాగార్జున, యువ సామ్రాట్ నాగ చైతన్య, రమ్యకృష్ణ, కృతి శెట్టి కాంబినేషన్‌లో రాబోతోన్న బంగార్రాజు సినిమాపై అంచనాలు విపరీతంగా పెరిగాయి. ఈ చిత్రానికి కళ్యాణ్ కృష్ణ కురసాల దర్శకత్వం వహిస్తున్నారు. సెకండ్ సింగిల్ 'నా కోసం' టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. నేడు ఈ పాటకు సంబంధించిన లిరికల్ వీడియోను విడుదల చేశారు. తన ప్రేయసి కృతి శెట్టి కోసం నాగ చైతన్య ఎంతలా తనని తాను మార్చుకున్నాడో ఈ పాటలో చెప్పారు. అనూప్ రూబెన్స్ మంచి మెలోడీ ట్యూన్‌ను అందించగా.. సిధ్ శ్రీరామ్ గాత్రం అద్భుతంగా ఉంది. నాగ చైతన్య, కృతి శెట్టిల మధ్య మంచి కెమిస్ట్రీ ఉంది. ఈ పాట చివర్లో నాగార్జున, రమ్యకృష్ణ, నాగ చైతన్య, కృతి శెట్టిలు కనిపించారు.అక్కినేని కుటుంబానికి చిరకాలం గుర్తుండిపోయే సినిమా మనం. అందులో నాగార్జున, యువ సామ్రాట్ నాగ చైతన్య కలిసి నటించారు. మళ్లీ ఇప్పుడు సోగ్గాడే చిన్ని నాయన సినిమాకు ప్రీక్వెల్‌గా రాబోతోన్న ఈ 'బంగార్రాజు' చిత్రంలో కలిసి నటిస్తున్నారు. ప్రస్తుతం బంగార్రాజు షూటింగ్ జరుగుతోంది.అన్నపూర్ణ స్టూడియోస్ ప్రై.లి., జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి నాగార్జున నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సత్యానంద్ స్క్రీన్ ప్లేను అందిస్తుండగా.. సినిమాటోగ్రఫర్‌గా యువరాజ్ పని చేస్తున్నారు.నటీనటులు : అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, రమ్యకృష్ణ, కృతి శెట్టి, చలపతి రావు, రావు రమేష్, బ్రహ్మాజి, వెన్నెల కిషోర్, ఝాన్సీ

# దేశం దాటాలని చూసింది.. పోలీసుల చేతికి చిక్కింది..!

దేశంలో 200 కోట్ల కుంభకోణం కేసు ఎంతటి సంచలనమైందో తెలిసిందే. కాన్ మాన్ ట్రాప్ లో పలువురు బాలీవుడ్ నాయికలు ఉన్నారు. ముఖ్యంగా బాలీవుడ్ హాట్ గాళ్ జాక్వెలిన్ పెర్నాండేజ్ ఈడీ విచారణని ఎదుర్కోంటున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆమెను రెండు సార్లు ఈడీ విచారించి కీలక సమాచారం సేకరించారు. సుకేష్ చంద్రన్ తో అత్యంత సన్నిహితంగా మెలగడం జాకీ పీకల మీదకు తెచ్చింది. ఇప్పటికే ఆమె ఇచ్చిన వాగ్మూలాన్ని ఛార్జ్ షీట్ లో పేర్కొన్నారు. తాజాగా దేశం దాటడానికి ప్రయత్నిస్తోన్న జాక్వెలీన్ పోలీసులకు చిక్కి మరింత సంచలనమైంది. ముంబై ఎయిర్ పోర్టులో ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆమె పాస్ పోర్ట్ పరిశీలించి తాను విదేశాలకు జంప్ అవుతున్నట్లు గ్రహించి వెంటనే పోలీసులకు అప్పగించినట్లు తెలుస్తోంది.ఓ వైపు కేసు విచారణలో ఉండగా శ్రీలంకన్ బ్యూటీ జాక్విలన్ ఇంతటి సాహసం ఎందకు చేసినట్టు? అంటే రియాద్ లో సల్మాన్ ఖాన్ నిర్వహిస్తోన్న 'దబాంగ్ టూర్' కోసం ఆదివారం దుబాయ్ ప్రయాణమైందట. అయితే పోలీసులు ఆమెకు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో.. దేశం నుంచి స్కిప్ అయ్యే అవకాశం కూడా ఉండటంతో కోర్టు ముందస్తు ఉత్తర్వులతో పోలీసులు జాగ్రత్తపడినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆమెను అధికారులు అదుపులోకి తీసుకుని ఢిల్లీ తరలించినట్లు తెలిసింది. అక్కడ మరోసారి మనీలాండరింగ్ కేసుకు సంబంధించి విచారించనున్నారు. అలాగే ఆక్షంలు ఉన్న సమయంలో విదేశాలు వెళ్లడం ఏంటి? అనేది ప్రధానంగా హైలైట్ అయ్యే అవకాశం ఉంది.మొత్తానికి జాక్వెలిన్ ఫెర్నాండేజ్ చుట్టూ రోజు రోజుకి ఉచ్చు బిగుస్తున్నట్లే కనిపిస్తోంది. ఇప్పటికే 200 కోట్ల కుంభకోణంలో 10 కోట్లు ఆమెఖాతలో బహుమతుల రూపంలో పడ్డట్లు పక్కా ఆధారాలు ఉన్నాయి. ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా కుంభకోణంలో భాగస్వామి అయింది. ఆమెతో పాటు నోరా పతేహీ కూడా వివాదాంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. కోటి రూపాయల ఖరీదుగల కారు..ఇంకా బహుమతులు నోరా పతేహీ అకౌంట్ జమ అయ్యాయి.






# న్యూజిలాండ్‌పై జైత్రయాత్ర.. టీమ్ ఇండియా అదిరిపోయే రికార్డులు..!

**12 టెస్టు సిరీస్‌ల్లో ఒక్కటీ గెలవలేకపోయిన కివీస్**

**ముంబయి: న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్టులో టీమ్‌ఇండియా ఘన విజయం సాధించగా పలు ఆసక్తికర రికార్డులు నమోదయ్యాయి. అందులో కొన్ని భారత జట్టు సాధించగా మరికొన్ని రవిచంద్రన్ అశ్విన్‌వి ఉన్నాయి. ఒక్కటి మాత్రం కివీస్ స్పిన్నర్ అజాజ్ పటేల్ నెలకొల్పాడు. అవేంటో ఓ లుక్కేద్దాం.**

**పరుగుల పరంగా భారత్‌కిదే అత్యంత భారీ విజయం..**

- **372: 2021లో ముంబయి వేదికగా న్యూజిలాండ్‌పై (ఈ మ్యాచ్‌లోనే)**
- **337: 2015లో దిల్లీ వేదికగా దక్షిణాఫ్రికాతో ఆడిన మ్యాచ్‌లో.**
- **321: 2016లో ఇండోర్ వేదికగా న్యూజిలాండ్‌తో తలపడిన వేళ.**
- **320: 2008లో మొహాలి వేదికగా ఆస్ట్రేలియాతో ఆడినప్పుడు.**

**ఈ టెస్టు సిరీస్‌లో నమోదైన రికార్డులివే..**



ఈ ఏడాది అశ్విన్ పడగొట్టిన వికెట్ల సంఖ్య 52కి చేరుకుంది. టెస్టుల్లో ఓ క్యాలెండర్ ఇయర్‌లో 50, అంతకన్నా ఎక్కువ వికెట్లు పడగొట్టడం అశ్విన్‌కిది నాలుగో సారి. 2015, 2016, 2017, 2021లో ఈ ప్రదర్శన చేసిన అశ్విన్.. అత్యధిక సార్లు ఆ ఘనత సాధించిన భారత బౌలర్‌గా రికార్డులకెక్కాడు. ఇదివరకు హార్భజన్, కుంబ్లే 3 సార్లు మాత్రమే ఈ ఘనత సాధించారు. దీంతో ఆ ఇద్దరి దిగ్గజాలను అశ్విన్ ఇప్పుడు వెనక్కినెట్టాడు. న్యూజిలాండ్‌పై టెస్టుల్లో ఇప్పటివరకు అశ్విన్ తీసిన వికెట్లు 66. రెండు జట్ల మధ్య టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్.. కివీస్ దిగ్గజ ఆల్‌రౌండర్ రిచర్డ్ హ్యాడ్లీ(65)ని అశ్విన్ అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో కివీస్ స్పిన్నర్ అజాజ్ బౌలింగ్ గణాంకాలివి 14/225. ఇక ఒకే ఇన్నింగ్స్‌లో పది వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. మరోవైపు ఓ టెస్టు మ్యాచ్‌లో భారత్‌పై అత్యుత్తమ ప్రదర్శన చేసిన బౌలర్‌గానూ అతడు నిలిచాడు. కివీస్ తరఫున టెస్టుల్లో అతడికిది రెండో అత్యుత్తమ ప్రదర్శన. రిచర్డ్ హ్యాడ్లీ (1985లో ఆస్ట్రేలియాపై 15/123) అగ్రస్థానంలో ఉన్నాడు. భారత్‌లో న్యూజిలాండ్ ఆడిన 12 టెస్టు సిరీస్‌ల్లో ఒక్కసారి కూడా సిరీస్ కైవసం చేసుకోలేదు. చివరిసారిగా ఆ జట్టు 1988లో వాంఖడే మైదానంలోనే ఒక టెస్టు గెలిచింది. భారత్‌కు ఇది స్వదేశంలో వరుసగా 14వ టెస్టు సిరీస్ విజయం.భారత్‌లో అత్యధిక టెస్టు వికెట్లు తీసిన ఆటగాళ్లలో అశ్విన్.. 350 అనిల్‌కుంబ్లే 300 రవిచంద్రన్ అశ్విన్ 265 హర్భజన్ సిగ్ 219 కపిల్ దేవ్ స్వదేశాల్లో టెస్టుల్లో వేగంగా 300 వికెట్ల క్లబ్‌లో చేరిన ఆటగాళ్లలో అశ్విన్.. 48 మ్యాచ్‌ల్లో ముత్తయ్య మురళీధరన్ తొలి స్థానంలో నిలిచాడు. 49 మ్యాచ్‌ల్లో రవిచంద్రన్ అశ్విన్ ఆ ఘనత సాధించి రెండో స్థానం. 52 మ్యాచ్‌ల్లో అనిల్‌కుంబ్లే మూడులో నిలిచాడు. 65 మ్యాచ్‌ల్లో షేన్‌వార్న్ నాలుగో స్థానం. 71 మ్యాచ్‌ల్లో జిమ్మీ ఆండర్సన్ ఐదులో ఉన్నాడు. 76 మ్యాచ్‌ల్లో స్టువర్ట్‌బ్రాడ్ ఆరో స్థానంలో నిలిచాడు.మ్యాచ్‌లో ఓటమిపాలైనా అత్యంత మేటి బౌలింగ్ ప్రదర్శనలో అజాజ్ టాప్ 14/225: 2021లో భారత్‌పై అజాజ్ పటేల్ నంబర్ వన్ 13/132: 1999లో పాకిస్థాన్‌పై జవగళ్ శ్రీనాథ్ 13/163: 1902లో ఆస్ట్రేలియాపై సిడ్నీ బార్న్స్ 13/217: 1988లో వెస్టిండీస్‌పై మెర్వ్ హ్యూస్ 13/244: 1896లో ఆస్ట్రేలియాపై టామ్ రిచర్డ్స్ పరుగుల పరంగా న్యూజిలాండ్‌కిదే అత్యంత భారీ ఓటమి 372: 2021లో భారత్‌తో తలపడిన మ్యాచ్‌లో. 358: 2007లో జోహెనస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికాతో ఆడినప్పుడు.321: 2016లో భారత్‌తో ఆడినప్పుడు. ఆక్లాండ్‌లో పాకిస్థాన్‌తో ఆడిన వేళ.

# అక్షర్.. పటేల్.. రవీంద్ర.. జడేజా.. ఫొటో అదిరింది! ఇదేదో సర్ఫ్ యాడ్‌లా ఉందే!

అజాజ్ పటేల్.. రచిన్ రవీంద్ర... టీమిండియా– న్యూజిలాండ్ టెస్టు సిరీస్ సందర్భంగా ఈ రెండు పేర్లు భారత అభిమానుల దృష్టిని ఆకర్షించాయి. ఇద్దరూ భారత మూలాలున్న క్రికెటర్లే.. ఇద్దరి కుటుంబాలు న్యూజిలాండ్‌కు వలస వెళ్లగా.. అక్కడి అంతర్జాతీయ క్రికెట్ జట్టులో ఈ ఆటగాళ్లు స్థానం దక్కించుకున్నారు. ఇక తొలి టెస్టులో భారత్‌తో దోబూచూలాడిన విజయాన్ని దక్కకుండా అడ్డుకున్నదీ వీరిద్దరేనన్న సంగతి గుర్తుండే ఉంటుంది. అజాజ్, రచిన్ అడ్డుగోడగా నిలబడటంతో టీమిండియా ఆఖరి వికెట్ తీయలేకపోవడంతో మ్యాచ్ డ్రా అయ్యింది.ఇక ముంబై వేదికగా జరిగిన రెండో టెస్టులో... పుట్టిన గడ్డ మీద అజాజ్ పటేల్ చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఏకంగా పది వికెట్లు పడగొట్టి ఈ ఘనత సాధించిన మూడో బౌలర్‌గా చరిత్రకెక్కాడు. మరోవైపు.. టీమిండియా ఆటగాళ్లు అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా కూడా టెస్టు సిరీస్‌లో తమదైన ముద్ర వేశారు. ఈ క్రమంలో.. రెండో టెస్టులో భారత్ ఘన విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకున్న తర్వాత ఈ నలుగురు స్పిన్నర్లు కలిసి దిగిన ఫొటో నెటిజన్లను విపరీతంగా ఆకర్షిస్తోంది. నలుగురూ తమ జెర్సీ నంబర్లు, పేర్లు కనబడేలా వెనుకకు నిల్చుని ఫొటోలు దిగారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190